# ఆదర్శదంపతులకు ఆశీస్సు

రచయిత్రి: శ్రీమతి వి. ప్రభావతిగారు

లీల మేడ కిటికీ దగ్గరకు వచ్చి ఆకాశంకేసి చూసేసరికి మబ్బులు విడిపోయి వెన్నెల వచ్చింది. అకస్మాత్తుగా ఆమెకు హృదయంలో మెరపు మెరసినట్లయింది.

లీలకు వివాహమై యిప్పటికి ఆరుమాసాలైంది. వివాహమైన వెంటనే తలిదండ్రుల్ని విడిచి భర్తతోవచ్చేసింది. లీలా మూర్తుల వివాహమంతా నూతన పంథాలో వారి అభిప్రాయ ప్రకారం జరిగింది. వీరి వివాహాన్ని గురించి బంధువులందరూ యెంతో సంతోషించారు. అనుకూల దాంపత్యం అన్నారు. నూతన మార్గాన్ని చూపినందుకు యెంతో మెచ్చుకొన్నారు.

లీల తెలివి తేటల్ని గురించీ జాతకాన్ని గురించీ మూర్తి బంధువులందరికీ గొప్ప అభిప్రాయం వుండేది. వివాహానికి ముందు లీలామూర్తుల జాతకాన్ని పోల్చి చూస్తే యెంతో అనుకూలంగా వున్నాయని మూర్తి తలిదండ్రులు చాలా సంతోషించారు. లీలకు మూర్తే తగిన వరుడని, ఆమె అదృష్టంవల్లనే దొరికాడనీ లీల తలిదండ్రులు ముచ్చటపడ్డారు. వివాహానికి ముందు లీల బంధువులలో కొందరు, ఆమెకు అనేక విధాల మూర్తిలోవున్న లోపాలను గోరంతలు కొండంతలుగా చేసి చెప్పారు.

'అతనికి సంపాదన మీద దృష్టి లేదు' అన్నారు. అదొక లోపంగా కనపడలేదు లీలకు. సంపాదన మీద దృష్టి సామాన్య మానవులకేవుంటుంది, మూర్తి అసాధారణ వ్యక్తి అనుకొన్నది.

'అతనిది నిలకడ లేని మనస్సు' అన్నారు. అదొక లోపంగా కనపడలేదు లీలకు. మూర్తి కళోపాసకుడు. ఎప్పటికప్పుడు నూతన శోభలను సృష్టించి పరిపూర్ణత్వ సిద్ధి కోసం ప్రయత్నించే గుణసంపన్నుడు అనుకొంది. వారింకా అనేకం చెప్పారు. వారి అమాయకత్వానికి నవ్వుకుంది. తన తన మూర్తి యీ సామాన్యుల కర్థమవుతాడా? అనుకుంది. చివరికి వధూవరుల సమ్మతిపైనే వివాహం జరిగింది. కవులు రచయితలూ కళోపాసకులు అంతా వచ్చి నూతన వధూవరులను ఆశీర్వదించారు. నిత్య నూతనత్వంకోసం తపించే మూర్తికి దివ్యజ్యోతి దొరికిందని అభినందించారు. లీల మహదానందంలో తేలియాడింది. వారి ప్రసంగాలకి పరవశురాలైంది. ఇంతటి వుత్తమ పురుషుని భార్య అయినందుకు గర్వించింది. తన జీవిత కుసుమాన్ని మూర్తి ఆదర్శసాధనకు సహాయం చెయ్యటానికై అంకితం చెయ్యాలనుకుంది.

వివాహం కాగానే మూర్తి, లీల తలిదండ్రుల సమ్మతిపై ఆమెను వినోదార్థం అజంతా, హంపీ, ఎల్లోరా మొదలైన ప్రదేశాలకు తీసుకు వెళ్ళాడు. అజంతా, హంపీ దృశ్యాలను చూచినప్పుడు లీల హృదయం ద్రవించింది. మూర్తి ఆయా ప్రదేశాల పూర్వ వైభవాన్ని ప్రస్తుత పరిస్థితిని కళ్ళకు కట్టినట్లు వర్ణించి చెప్పాడు. లీల హృదయం నవనీతం. పూర్వ వైభవాన్ని విన్నప్పుడు ఆమె హృదయం వుప్పొంగింది. ప్రస్తుత పరిస్థితిని చూచినపుడు ఆమె హృదయం కృంగిపోయింది. మూర్తిలాంటి కళారాధకులు పదిమందివుంటే దేశం యింత దీనస్థితికి వచ్చేది కాదేమో అనుకొంది. ఆ క్షణం ఆమె కళ్ళకు మూర్తి దేవతామూర్తిలాకనుపించాడు. 'నా మూర్తి' అని గర్వంతో అనుకొంది. అతని చేత అనేక ఘనకార్యాలను చేయించాలని నిశ్చయించుకుంది.

దంపతులిద్దరూ యింటికి తిరిగి వచ్చారు. మూర్తి చిత్రకారుడు. పిత్రార్జితం తక్కువ. అందువల్ల రాబోయే పరిస్థితులు ఎదుర్కోవలసిన ఘట్టాలు మూర్తి లీలకు చెప్పాడు. వివాహానికి ముందే ఒకరి పరిస్థితు లొకరికి చెప్పుకొన్నారు. తమ నిష్కపటస్వభావాలకు తామే సంతోషించుకున్నారు.

ఇంటికి తిరిగి రాగానే కుటుంబం క్లుప్తంగా జరపాలని సంకల్పించుకుని మూర్తి నడిగింది లీల.

"నీ యిష్టం"—అన్నాడు మూర్తి—"ఇద్దరం—మనకి జరగదా?" అని చిరునవ్వు నవ్వాడు.

ఆ నవ్వు లీల అర్థం చేసుకుంది. మూర్తికి పిల్లలంటే యిష్టం లేదు. లీలకూ పిల్లలు కావాలని లేదు. గంపెడు పిల్లలను పెట్టుకుని సంసారం యీదలేక చీదరించుకుంటూ బ్రతికే దంపతులను, అనేక మందిని ఆమె చూసింది.

మూర్తి తన్మయత్వంతో చిత్రం గీసుకుంటూవుంటాడు.

# ఆదర్శదంపతులకు ఆశీస్సు

ఆమె ప్రక్కన కూర్చుని హాయిగా పాడుతూవుండేది. లీల యిల్లు కదలదు. షికారుకు వెళ్ళేది కాదు. ఆప్తులనుకూడా చూసేదికాదు. ఎప్పుడూ మూర్తి ప్రక్కనే వుండేది. అతనికి చిత్ర రచనకు కావలసినవన్నీ అమర్చి పెట్టేది. అతని కే యిబ్బందీ కలగకుండా చూస్తూవుండేది. వారి జీవితమే జీవితము.

ఈవిధంగా రోజులు గడుస్తున్నై. మూర్తి చిత్రాలు గీస్తున్నాడు. ఎప్పుడూ లీల అతని ప్రక్కనే వుండాలి. లీల లేక పోతే అతనికి కుంచె నడవదు.

సాధారణంగా వారు ప్రతి సాయంకాలము గ్రంథ పఠనతో కాలక్షేపం చేసేవారు. వాకిలి ముందు మల్లెపందిరి క్రింద కుర్చీలు వేసుకుని కూర్చునేవారు. ఆ మత్తెక్కించే సువాసనల్లో మూర్తి, లీలకు పుస్తకాలు చదివి వినిపించేవాడు. మధ్యమధ్య "ఓహో యేమి వున్నత భావాలు" అనే వాడు. ఆమె "అవును" అనేది.

"లీలా యిలా చదువుకుంటూ చిత్రాలు గీసుకుంటూ ఒకరి ప్రక్క నొకరు ప్రపంచంలో అంతా యీర్ష్యపడేటట్లు జీవించటంకంటే యింకేం కావాలి?" అన్నాడు మూర్తి

"అవును" అన్నది లీల.

"లీలా మనం అదృష్టసంపన్నులం కామూ?—ఎంత అదృష్టవంతులం!" అన్నాడు మూర్తి ఆమె శరీరంలోని ప్రతి అణువూ గర్వించింది.

ఒకనాడు వారిద్దరు గ్రంథపఠనలో వుండగా ఆ వూళ్ళో వున్న ఒక చిత్రకారుడు వచ్చి, చిత్రకారులందరూ కలసి ఆ వూరులో వొక చిత్ర ప్రదర్శనం యేర్పాటు చేస్తున్నారనీ వారంరోజులు జరుగుతుందనీ, రెండు రోజుల్లో ప్రారంభమవుతుందనీ మీరుకూడా రావలసిందనీ మూర్తిని ఆహ్వానించి వెళ్ళాడు.

మూర్తి తన చాతుర్యమంతా చూపి గొప్ప చిత్రాన్ని సృష్టించి చిత్ర ప్రదర్శనలో పెడతానన్నాడు లీలతో. లీల చిత్రం త్వరగా పూర్తి చెయ్యమని ప్రోత్సహించింది. ఎక్కడ ఆలస్యమై పోతుందోనని అతనికి కావలసినవన్నీ అడగకుండానే అందించేది.

మూర్తి ఆ రాత్రే చిత్ర రచన ప్రారంభించాడు. రంగులు నిండుకుంటున్నై. కుంచెలు మారిపోతున్నై. క్రమంగా చిత్రం మానవాకృతిని దాల్చింది. ఆ చిత్రాన్ని చూచుకుని మూర్తి వుప్పొంగిపోయాడు. ఆ చిత్రంలో తాను స్ఫురింపచేసిన భావాలను లీలకు విప్పి చెప్పాడు. ఇద్దరూ ఆనంద పరవశులయ్యారు. రెండు రోజుల్లో చిత్రం పూర్తయింది. మూర్తి ఆ చిత్రాన్ని చిత్ర ప్రదర్శనశాలకు తీసుకు వెళ్ళి దాని నక్కడ విడచి, మిగిలినవారి చిత్రాల నొకసారి చూసి వచ్చేశాడు. తాము అహోరాత్రాలు కష్టపడి పూర్తిచేసిన చేసిన చిత్రాన్ని విడిచి వచ్చినందుకు యిద్దరికీ విచారం కలిగింది.

వారం రోజులు గడిచినై. ఆ రోజు చిత్ర ప్రదర్శనలో తమ కళానైపుణిని గొప్పగా చూపిన చిత్ర కారులకు బహుమతులిస్తారు. దీనికి ఒక గొప్ప సభ యేర్పాటు చేశారు. అనేకమంది కళావేత్తలు, రచయితలు, కవులు సభకు వచ్చారు. మూర్తి సరిగా సమయానికి వెళ్ళాడు. ఒక ఆంగ్ల చిత్ర చిత్ర కళావేత్తను ఆ సభకు అధ్యక్షునిగా యెన్నుకొన్నారు. అతడు, బహుమతులు తీసుకోవలసిన వారి పేర్లను చదివాడు. ప్రథమ బహుమతి ఐదువేలు మూర్తికి వచ్చింది. మూర్తి నిర్విణ్ణుడయ్యాడు.

సభలో అందరి దృష్టులు అతని మీదికే ప్రసరించాయి. మూర్తి లేచి అధ్యక్షుని వేదిక దగ్గరకు వెళ్ళాడు. అతడు మూర్తిని యెంతో మెచ్చుకొన్నాడు. ప్రథమ బహుమతి ఐదువేలు మూర్తి కిచ్చాడు. సభలో కరతాళధ్వనులు.

రాత్రి 8 గంటలు .....లీల మేడ కిటికీ దగ్గరకువచ్చి ఆకాశంకేసి చూసేసరికి మబ్బులు విడిపోయి వెన్నెల వచ్చింది. లీల హృదయాకాశంలో మెరుపు మెరసినట్లయింది.

"లీలా?"......

లీల వెనుకకు తిరిగింది.

"చిత్ర ప్రదర్శనలో నాకే ప్రథమబహుమతి ఐదువేలు"

ఆఁ!......లీల హృదయం వుప్పొంగింది. ఉత్సాహంతో మూర్తి కరస్పర్శ చేసింది.

"మరి నాకో ప్రథమ బహుమతి?" అంది లీల నవ్వుతూ.

మూర్తి అర్థంచేసుకుని ఆమె కళ్ళలోకి చూశాడు. చంద్రుడు కిటికీలోంచి తొంగిచూస్తూ ఆశీర్వదించాడు ఆ ఆదర్శదంపతుల్ని......

★